టీఆర్టీ(డీఎస్సీ) ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ జిల్లా నిరుద్యోగ ఎస్సీ అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచితంగా రెసిడెన్షియల్‌తో కూడిన టీఆర్టీ(డీఎస్సీ) శిక్షణ ఇస్తామని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ కోసం డీఈడీ(టీటీసీ), బీఈడీ, టెట్ ఉత్తీర్ణులై డీఎస్సీ-2024కు దరఖాస్తు చేసుకున్న హైదరాబాద్ జిల్లాకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3లక్షలకు మించకూడదని తెలిపారు. ఇతర కోర్సులు అభ్యసిస్తున్న వారు, గతంలో ఉచిత శిక్షణ పొందిన వారు అనర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 25 లోపున tsstudycircle.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధికి దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువు కోసం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 31 వరకు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. యూఎస్ఏ, కెనాడా, జర్మనీ, యూకే, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో చదువుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. కుటుంబ ఆదాయం రూ.5లక్షలు మించకూడదని చెప్పారు. రూ.20లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఒక కుటుంబం నుంచి ఒకరికి మాత్రమే వర్తిస్తుందని అన్నారు. గ్రాడ్యుయేషన్‌లో 60శాతం, జీఆర్ఈ/జీఎంఏటీ, ఇంగ్లిష్ ప్రావీణ్యత పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులు telanganaepass.cgg.giv.in లో పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు.

నీటి వనరులను పరిరక్షించాలి

ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : నగరంలోని నీటి వనరులు ఆక్రమణలకు గురి కాకుండా పరిరక్షించడానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం బుద్ధ భవన్‌లోని ఈవీడీఎం కార్యాలయం సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని చెరువుల వద్ద ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ సరిహద్దులకు సంబంధించిన మ్యాప్‌లను చెరువుల వద్ద ప్రదర్శించాలని సూచించారు. లేక్ ప్రొటెక్షన్ కమిటీలను ఏర్పాటు చేయాలని, ఈ కమిటీ సభ్యులచే వాట్సాప్ గ్రూపులను చైతన్య పర్చాలని, మొబైల్ యాప్ ఇవ్వాలని, ఇందులో పర్యవేక్షణ నివేదిక పెట్టాలన్నారు. ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్, సీవరేజీ మళ్లింపు, సీసీ కెమెరాలు, వీధి దీపాలు, సెక్యూరిటీ గార్డుల ఏర్పాటుకు అంచనా ప్రతిపాదనలు 15 రోజులలో ఇవ్వాలని లేక్స్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ వ్యర్థాలను చెరువులలో డంప్ చేస్తున్న వారిని గుర్తించి ఈవీడీఎం డైరెక్టర్‌కు సమాచారం ఇవ్వాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని లేక్స్ అధికారులను ఆదేశించారు. చెరువు బఫర్ జోన్‌లో నిర్మించే భవనాలకు ఉన్న పక్షంలో నోటీసులు జారీ చేయాలన్నారు. సమావేవంలో ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, సునంద, జోనల్ కమిషనర్లు హేమంత్, స్నేహ శబరీష్, అభిలాష అభినవ్, రవి కిరణ్, వెంకన్న, ముకుందా రెడ్డి, ప్రాజెక్టు, లేక్స్ సీఈ దేవానంద్, ఎస్ఈ ఆనంద్, ఈఈ, తదితరులు పాల్గొన్నారు.

మూసీ సుందరం..

- వినూత్న ఆలోచనలు.. విజ్ఞాన ప్రదర్శనలు
- ఘనంగా ఓయూ ఇంజినీరింగ్ సింపోజియం ప్రారంభం
- వివిధ విభాగాల్లో ప్రారంభమైన పోటీలు
- సందడిగా మారిన క్యాంపస్

ఆకృతిలో చంద్రయాన్

ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని వివిధ విభాగాలలో వేరువేరు పేర్లతో జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్టివల్ (సింపోజియం) ప్రారంభమైంది. ఈ సింపోజియంలో భాగంగా విద్యార్థులు పలు విభాగాలలో పోటీలు నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీలలో విద్యార్థులకు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం ఉండడంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు కళాశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దీంతో యూనివర్సిటీ సందడిగా మారింది. ఈ సింపోజియంలను అధ్యాపకులతో సంబంధం లేకుండా ఆయా విభాగాల విద్యార్థులే నిర్వహించారు. అధ్యాపకులు కేవలం సలహాదారులుగా వ్యవహరిస్తారని విద్యార్థులు వివరించారు. విద్యార్థుల అభిప్రాయాలు, పరిశోధనల అనుభవాలను ఒక వేదికపైకి తీసుకువచ్చేందుకు ఈ సింపోజియంలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. టీమ్ వర్క్, ప్రణాళిక, నిధుల సేకరణ తదితర అంశాలను విద్యార్థి దశలోనే నేర్చుకోవచ్చని చెబుతున్నారు.

నిర్మాణ్'లో విద్యుద్దీపాల మధ్య తణుకులీనుతున్న మూసీ సుందరీకరణ నమూనా

'టెక్నోనెన్స్'తో సందడి చేసిన ఎలక్ట్రికల్ విద్యార్థులు

ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు టెక్నోనెన్స్ - 2024 పేరుతో సింపోజియం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ రకాల పేర్లతో పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, నాన్ టెక్నాలజీ క్విజ్, టెక్నాలజీ క్విజ్, లైవ్ ప్రాజెక్టులు, షార్ట్ ఫిల్మ్, మేకింగ్ ఆఫ్ సర్క్యూట్, కల్చరల్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ టెక్నోనెన్స్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ, ఐఏఎస్ అధికారి ముషారఫ్ అలీ ఫరూఖీ హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అమెరికాలోని కృష్ణ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ అధినేత గోపాల్ టీకే కృష్ణ, ఓయూ యూజీసీ డీన్ ప్రొఫెసర్ మల్లేశం, హెడ్ ప్రొఫెసర్ విద్యాసాగర్, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ మంగు, డాక్టర్ ఎస్.విజేందర్‌రెడ్డి, విద్యార్థి కన్వీనర్ అభిన వ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెకానికల్ విద్యార్థుల 'మెకరీనా'

మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు మెకరీనా పేరుతో సింపోజియం నిర్వహిస్తున్నారు. రోబొటిక్స్, పేపర్ ప్రజెంటేషన్, క్విజ్, లైవ్ ప్రాజెక్టులు, స్పాట్ ఇవెంట్స్ తదితర విభాగాలలో పోటీలు నిర్వహిస్తున్నారు. వర్సిటీ ల్యాబ్‌లో ఉన్న అధునాతన యంత్రాలను విద్యార్థుల చూసేందుకు వీలుగా ప్రదర్శన ఏర్పాటు చేశారు. నిపుణులచే అతిథి ఉపన్యాసాలను ఏర్పాటు చేశారు. ఈ మెకరీనా 2024 ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా భారత్ ఫోర్జ్ లిమిటెడ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఫణి కౌండిన్య హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఫ్యాకల్టీ అడ్వైజర్ డాక్టర్ టి. నాగవేణి, స్టూడెంట్ కన్వీనర్ అనురాగ్, కోకన్వీనర్లు శశాంక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎలక్ట్రానిక్ విద్యార్థుల 'ఆకృతి'

సింపోజియం 'ఆకృతి'లో భాగంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో భాగంగా టెలిఫోన్, క్యాలిక్యులేటర్, అనలాగ్ కంప్యూటర్, కెమెరా, టీవీ, టైప్‌రైటర్, రేడియో తదితర వస్తువుల మొదటి తరం నమూనాలను ప్రదర్శించారు. 'చంద్రయాన్' అనే థీమ్‌తో నమూనా రూపొందించారు. ఇందులో భాగంగా పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, బిజినెస్ క్విజ్, ప్రోగ్రామింగ్ క్విజ్, రొబోటిక్స్, టెక్నాలజీ క్విజ్, షార్ట్ ఫిల్మ్ మేకింగ్ తదితర అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సింపోజియం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా డీఆర్‌డీవో ఆర్‌సీఐ ఔట్ స్టాండింగ్ సైంటిస్ట్ జాగీర్దార్ హాజరై ప్రసంగించారు. ఓటములను తట్టుకుని, లక్ష్యాన్ని మనసులో పెట్టుకుని కష్టపడితే గమ్యాన్ని చేరుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, హెడ్ ప్రొఫెసర్ రామకృష్ణ, ఫ్యాకల్టీ అడ్వైజర్ డాక్టర్ శ్యాంసుందర్, స్టూడెంట్ కన్వీనర్ సాయిచంద్ర, కోకన్వీనర్లు రాకేశ్, నిఖిల్‌నాయక్, శ్రీద్యుతి, శిశిర తదితరులు పాల్గొన్నారు.

బయోమెడికల్ విద్యార్థుల 'మెడిటెక్'

బయోమెడికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు మెడిటెక్ 2024 పేరుతో సింపోజియం నిర్వహిస్తున్నారు. ఈ సింపోజియం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఐఏఎస్ అధికారి, హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు పేపర్ ప్రజెంటేషన్, క్విజ్, స్పాట్ ఈవెంట్స్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. అధునాతన వైద్య పరికరాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మెడిసిన్ మెడికల్ ప్రోడక్ట్స్ సీఈవో ఖుర్రూవకీల్, విభాగం హెడ్ ప్రొఫెసర్ మాలిని, డాక్టర్ సుమన్‌రెడ్డి, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల 'ఇన్ఫినిటీ'

కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఇన్ఫినిటీ పేరుతో విద్యార్థులు సింపోజియం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు టెక్నాలజీ ఈవెంట్, పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, మూవీ క్విజ్, స్పాట్ ఈవెంట్స్, పన్నెండు గంటల కంప్యూటర్ కోడింగ్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ఐటీఈఅండ్‌సీ విభాగం ఎమర్జింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్ రమాదేవి లంక, యువర్ వోల్టా సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ శశికాంత్ కనపర్తి, హెడ్ ప్రొఫెసర్ పీవీ సుధ, ఫ్యాకల్టీ కన్వీనర్ డాక్టర్ గోవర్ధన్ రావు, స్టూడెంట్ కన్వీనర్ సుజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ ఇంజినీరింగ్ విద్యార్థుల 'ఇగ్నైట్'

మైనింగ్ ఇంజినీరింగ్ విభాగంలో ఇగ్నైట్ పేరుతో విద్యార్థులు సింపోజియం నిర్వహించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ బీఆర్‌వీ సుశీల్‌కుమార్ హాజరై ప్రసంగించారు. సింపోజియంలో భాగంగా మైన్స్ క్విజ్, మైన్ మోడల్ ప్రజెంటేషన్, డిబేట్, వర్క్‌షాప్స్, మైన్ ఎన్విరాన్‌మెంటల్ ఎక్స్‌పీమెంట్ ప్రజెంటేషన్ తదితర అంశాలలో పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐటీ రూర్కెలా ప్రొఫెసర్ హిమాన్షు భూషణ్ సాహూ, వెన్సర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ అడ్వైజర్ ఎంఎస్ వెంకట్రామయ్య, మినిస్ట్రీ ఆఫ్ కోల్ మాజీ అడ్వైజర్ డీఎన్ ప్రసాద్, రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, ఫ్యాకల్టీ అడ్వైజర్ ఎం.సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'నిర్మాణ్'లో.. సివిల్ విద్యార్థుల ప్రతిభ

సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు నిర్మాణ్ పేరుతో సింపోజియం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రతిభను వెలికితీశారు. విద్యార్థులు రూపొందించిన అధునాతన మూసీ నమూనాను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. పేపర్ ప్రజెంటేషన్, టెక్నో జనరల్ క్విజ్, క్యాడ్‌మానియా, ట్రెజర్‌హంట్, సేజ్ ఆన్ స్టేజ్ తదితర అంశాలలో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, హెడ్ ప్రొఫెసర్ రాజశేఖర్, స్టూడెంట్ కన్వీనర్ శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

మెకరీనా బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

25 నుంచి సనాతన వేదాంత జ్ఞాన సభలు

రవీంద్రభారతి, మార్చి 22 : హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ, శ్రీమలయాళ స్వామి భక్త బృందం హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 27వరకు 98వ శ్రీ సనాతన వేదాంత జ్ఞాన సభలు నిర్వహిస్తున్నట్లు వ్యాసాశ్రమ వ్యాస పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ పరిపూర్ణనందగిరి స్వామీజీ తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ శ్రీవ్యాసాశ్రమం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఒక్కొక్క రాష్ట్రంలో మూడు రోజుల పాటు జ్ఞాన సభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 25 నుంచి మూడు రోజుల పాటు బాలాపూర్‌లోని ఎస్పీఆర్ శ్రీలక్ష్మి కన్వెన్షన్ సెంటర్‌లో సభలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల పీఠాధిపతులు, స్వామీజీలు, మాతాజీలు 100మందికిపైగా ఒకే వేదికపై పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో జ్ఞాన సభల నిర్వాహకుడు సరాబు లక్ష్మణ్‌గుప్తా, కాశెట్టి పాండుగుప్తా, అల్లాడి నాగభూషణం, మేడం దాయాకర్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

అడుగంటిన జలాలు.. ట్యాంకర్లకు డిమాండ్

రాత్రి సమయాల్లోనూ నీటి సరఫరా చేయాలి: ఎం.దానకిశోర్

సమీక్ష నిర్వహిస్తున్న పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ఫిబ్రవరి నెలలోనే జలమండలి ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ అన్నారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఎండీ సుదర్శన్ రెడ్డితో పాటు డైరెక్టర్లు, ఇతర అధికారులతో జలమండలి వేసవి కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ మాట్లాడుతూ నగరంలోని 4 డివిజన్లలో (డివిజన్ 15, 6, 9, 18) ట్యాంకర్ల డిమాండ్ బాగా ఉన్నదని, మొత్తం బుకింగ్స్‌లో 73శాతం ఇక్కడి నుంచే వస్తున్నట్లు గుర్తించామన్నారు. గతేడాది ఇదే నెల సరఫరా చేసిన నీటి కంటే ఈ ఏడాది అదనంగా మరో 10 ఎంజీడీల నీరు సరఫరా చేసినట్లు వెల్లడించారు. ఈ ఏప్రిల్ నాటికి అదనంగా మరో 12 ఎంజీడీల జలాలు సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. రాత్రి సమయాల్లోనూ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాచేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో జలమండలి రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, సీజీఎంలు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే కేజ్రీవాల్ అరెస్టు

పాఫ్రెసర్ కోదండరామ్

రవీంద్రభారతి, మార్చి 22 : రాజకీయ కక్షలో భాగంగానే ఢిల్లీ సీఎం అరవింద్ క్రేజీవాల్‌ను అరెస్టు చేశారని తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షుడు, రిటైర్డ్ పొఫెసర్ కోదండరామ్ అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఉద్యమ ఆకాంక్షలు, విద్యాప్రమాణాలు, ప్రభుత్వ కర్తవ్యాలు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో పౌరహక్కుల నేత హరగోపాల్‌తో కలిసి కోదండరామ్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో అంతర్జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అధ్యాపకులు, యూనివర్సిటీ ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాలని, అన్ని యూనివర్సిటీలకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. యూజీసీ గ్రాంట్ కమిషన్‌కు ఏటా 6వేల కోట్లు కేటాయించేవారని, వాటిని 2వేల కోట్లకు తగ్గించారని మండిపడ్డారు. ఈ సమావేశంలో విశ్వేశ్వర్‌రావు, ప్రెస్ అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, అంబటి నాగయ్య, తిప్పర్తి యాదయ్య, డా.కొండ నాగేశ్వరరావు, డా.రాయ్‌దాస్‌రాయ్, ఆర్.వెంకట్‌రెడ్డి, డా.ఈ ఉపేందర్, నగేశ్, రమణ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో 50 ఏండ్ల తర్వాత..

అంతర్జాతీయ కరాటే టోర్నమెంటు

అతిథ్యం ఇవ్వనున్న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం

- వచ్చే ఏడాది జనవరిలో పోటీలు
- దాదాపు 3వేల మందికి పైగా హాజరుకానున్న యోధులు
- వివరాలు వెల్లడించిన తెలంగాణ జేకేఏఐ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సెన్సాయి రాపోలు సుదర్శన్

వివరాలు వెల్లడిస్తున్న జేకేఏఐ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సెన్సాయి రాపోలు సుదర్శన్

మణికొండ, మార్చి 22 : జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా(జేకేఏఐ) అంతర్జాతీయ కరాటే టోర్నమెంట్-2025కు హైదరాబాద్ మహానగరం అతిథ్యం ఇవ్వనున్నదని జేకేఏఐ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సెన్సాయి రాపోలు సుదర్శన్ తెలిపారు. నార్సింగి మున్సిపాలిటీ ఖానాపూర్‌లోని డుజో కరాటే శిక్షణ క్యాంపస్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో అంతర్జాతీయ టోర్నమెంట్ వివరాలను వెల్లడించారు. దాదాపు 50 ఏళ్ల తర్వాత భారతదేశంలోని హైదరాబాద్‌లో తొలిసారిగా అంతర్జాతీయ టోర్నమెంట్ జరుగుతుందని చెప్పారు. ఈ పోటీలకు ప్రపంచ వ్యాప్తంగా 3వేల మందికి పైగా కరాటే యోధులు పాల్గొంటారని తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 18 నుంచి 22 వరకు నగరంలోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో 'అంతర్జాతీయ కరాటే టోర్నమెంట్-2025' అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టామన్నారు. 17వ ఆల్ ఇండియా జేకేఏఐ క్యూ లెవల్ కరాటే, 12వ ససాకి, షోయిని, మెమోరియల్ సీనియర్స్ నేషనల్ కరాటే పోటీలు జరుగుతాయన్నారు. కటా(ఫారం), కుమిటే(స్పారింగ్) భాగస్వామ్యానికి ఎంపికలు త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర జేకేఏఐ నూతన చీఫ్ ఇన్‌స్ట్రక్టర్‌గా సెన్సాయి దయానంద్ కుమార్‌ను నియమిస్తున్నట్లు రాపోలు సుదర్శన్ ప్రకటించారు. వచ్చే ఏడాది జరిగే అంతర్జాతీయ పోటీలకు దయానంద్ ప్రధానకర్తగా వ్యవహరిస్తారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి జేకేఏఐ డైరెక్టర్లు శ్రీనివాసచారి, ధన్‌రాజ్, విష్ణువర్ధన్, శ్రీకాంత్, చెన్నయ్య, చందర్, నాగరాజ్, శ్యాంసన్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ కమిటీ ఏర్పాటు

తెలుగు యూనివర్సిటీ, మార్చి 22 : తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య (ఎన్ఎస్ఎస్) సర్వసభ్య సమావేశంలో నూతన రాష్ట్ర కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకుల సదానందం, ప్రధాన కార్యదర్శి సాధు శ్యాంప్రసాద్, కార్యనిర్వహక కార్యదర్శి మారంరాజు రాంచందర్‌రావు, ప్రచార కార్యదర్శి వరకవుల దుర్వాసరాజు, కోశాధికారి నామా సూర్యవర్ధన్ రెడ్డి, గౌరవ సలహాదారులుగా డాక్టర్ కేవీ రమణాచారి వ్యవహరించనున్నట్లు సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రామచందర్‌రావు తెలిపారు.

జీహెచ్ఎంసీలో అటెండెన్స్‌పై అవగాహన

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఐటీ శాఖ ఆధ్వర్యంలో శానిటేషన్ వర్కర్ల హాజరుకు సంబంధించి ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం అమలు చర్యల్లో భాగంగా మొబైల్ ద్వారా సంబంధిత యాప్‌లో హాజరు నమోదుపై ఏఎంహెచ్ఓలు, ఎస్ఎఫ్ఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. వీడియోల రూపంలో వివరించారు.

కేర్ ఆస్పత్రిలో డయాబెటిక్ ఫుట్ క్లినిక్ ప్రారంభం

డయాబెటిక్ ఫుట్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న నేషనల్ పోలీస్ అకాడమి డైరెక్టర్ అమిత్‌గార్గ్ తదితరులు

బంజారాహిల్స్, మార్చి 22 : బంజారాహిల్స్ రోడ్ నం.10లోని కేర్ అవుట్ పేషెంట్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డయాబెటిక్ ఫుట్-ఊండ్ క్లినిక్‌ను నేషనల్ పోలీస్ అకాడమి ఇన్‌చార్జి డైరెక్టర్ అమిత్ గార్గ్, కేర్ ఆస్పత్రి సీఈవో జస్‌దీప్ సింగ్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్‌దీప్ సింగ్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో 10మందిలో ఆరుగురు మధుమేహం భారిన పడుతున్నారని, సరైన చికిత్స చేయించుకోకపోతే పాదాలు తొలగించాల్సిన ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లినికల్ డైరెక్టర్ డా.పీసీ.గుప్తా తదితరులు పాల్గొన్నారు.

లాజిస్టిక్స్‌లో స్టార్టప్‌లను ప్రోత్సహించాలి

ఐఎఫ్ఎస్, డాక్టర్ విష్ణువర్ధన్

మాదాపూర్, మార్చి 22 : లాజిస్టిక్స్ అనేది ప్రపంచ వాణిజ్యానికి జీవనాధారమని ఐఎఫ్ఎస్, డాక్టర్ విష్ణువర్ధన్ అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం ఏర్పాటు చేసిన షిప్పింగ్, లాజిస్టిక్స్‌పై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా ఐఎఫ్ఎస్ విష్ణువర్ధన్‌రెడ్డి విచ్చేసి షిప్పింగ్, లాజిస్టిక్స్ కమిటీ చైర్మన్ కమల్ జైన్, ఎస్ఎంఈ జాయింట్ సెక్రెటరీ మెర్సీ ఇపావో, జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రదీప్ పనికర్, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ స్వరూప్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాజిస్టిక్స్ ధరను 9శాతం తగ్గించడంపై భారత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. హైదరాబాద్‌కు ఔటర్ రింగ్ రోడ్డు ఉండటం వల్ల భారీ ప్రయోజనం చేకూరనున్నట్లు తెలిపారు.

కార్యక్రమాన్ని ప్రారంభించిన ఐఎఫ్ఎస్, డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

రసరంజని నాటకోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

రసరంజని నాటకోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రమణాచారి, ముట్నూరి కామేశ్వరరావు, రామకోటేశ్వరరావు, మోహన్ సేనాపతి

తెలుగు యూనివర్సిటీ, మార్చి 22 : తెలుగు నాటక రంగ వికాసానికి మూడు దశాబ్దాలుగా తోడ్పాటును అందిస్తున్న రసరంజని 31వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఐఏఎస్ అధికారి, రసరంజని అధ్యక్షుడు డాక్టర్ కేవీ.రమణాచారి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవీంద్రభారతి ప్రధాన ఆడిటోరియంలో 25, 26, 27తేదీలలో నిర్వహించనున్న రసరంజని నాటకోత్సవాల బ్రోచర్‌ను రమణాచారి తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఇటీవల తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారాన్ని అందుకున్న రసరంజని కోశాధికారి మోహన్ సేనాపతిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రసరంజని కార్యదర్శి ముట్నూరి కామేశ్వరరావు, ఉపాధ్యక్షులు డి.రామకోటే